ప్రజాశక్తి
శనివారం 9 నవంబరు 2024

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని నెల్లిపర్తి, వంజంగికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు మానుకొండ మురళీధర్, పూజారి సతీష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎపిఒ ఎస్.లక్ష్మీనరసమ్మ తెలిపారు. నెల్లిపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ మురళీధర్ సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఉపాధి హామీ నిధుల అవకతవకలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందని తెలిపారు. నెల్లిపర్తిలో నిర్వహించిన గ్రామసభకు, మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ సభకు హాజరు కాలేదని చెప్పారు. వంజంగి ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్ సుమారు రూ.1.85 లక్షల మేరకు అవకతవకలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిరువురికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

మహాసభలకు వేళాయే..

- నేడు, రేపు సిపిఎం జిల్లా మహాసభలు
- ఎర్ర జెండాలు, తోరణాలతో పలాస ముస్తాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

సిపిఎం శ్రీకాకుళం జిల్లా 18వ మహాసభలు పలాసలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగనున్నాయి. మహాసభలకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. మహాసభల నేపథ్యంలో పలాస పట్టణం ముస్తాబైంది. మహాసభ వేదికైన కాశీబుగ్గ రైల్వే కాలనీలో ఎర్రజెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలాస-కాశీబుగ్గలోని ముఖ్య కూడళ్లు, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు రోడ్డుకు ఇరువైపులా... రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి రైల్వే ఇన్‌స్టిట్యూట్ వరకు ఎర్రజెండాలు, తోరణాలతో ముస్తాబు చేశారు. మహాసభలకు సంబంధించి ఇప్పటికే విస్తృత ప్రచారం చేశారు. గ్రామాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. ఆటోల్లో మైకేల ద్వారా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభ జరుగుతున్న ప్రాంతానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కీ.శే సీతారాం ఏచూరి నగర్‌గా నామకరణం చేశారు. సభా ప్రాంగణానికి కొల్లి సత్యనారాయణ, బమ్మిడి శ్రీరాములు పేర్లు పెట్టారు. సభా ప్రాంగణాన్ని, వేదికను ఎర్రజెండాలు, తోరణాలతో అందంగా అలంకరించారు. మహాసభల మొదటి రోజు శనివారం ఉదయం పది గంటలకు పలాస బస్టాండ్ నుంచి కాశీబుగ్గ సంత మైదానం వరకు భారీ ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ సభలో ప్రసంగించనున్నారు. ర్యాలీ, బహిరంగ సభకు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు కోరారు.

తోరణాలు కడుతున్న నాయకులు

మూడు రోడ్ల కూడలి వద్ద అలంకరించిన సిపిఎం తోరణాలు

కష్టజీవుల జెండా... ప్రత్యామ్నాయమే అజెండా

- పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలు సాగించిన సిపిఎం
- కార్మికులు, కర్షకులకు అండగా అనేక ఆందోళనలు
- జిల్లా అభివృద్ధికి అనేక ప్రత్యామ్నాయాలు చూపిన వైనం

మహాసభలను జయప్రదం చేయాలని మందసలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కార్మిక, కర్షక వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం, మరోవైపు అభివృద్ధికి అవసరమైన ప్రత్యామ్నాయాలు సూచిస్తోంది. జిల్లాలోని సాగునీటి వనరుల సమగ్ర వినియోగానికి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, అందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని ప్రభుత్వం ముందు అనేకసార్లు డిమాండ్ ఉంచింది. కాలుష్య కారక పరిశ్రమల స్థానంలో కాలుష్యరహిత, వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలని చెప్తోంది. గిరిజనులు, మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. గిరిజనులు పండించే పంటలకు గిట్టుబాటు, మత్స్యకారులకు ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలు నిర్మించాలని ప్రభుత్వం ముందు పలుమార్లు డిమాండ్‌గా ఉంచింది. వీటిని పెడచెవిన పెట్టిన పాలకులు కార్పొరేట్ అనుకూల విధానాలతో ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పలాసలో శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న సిపిఎం 18వ జిల్లా మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనుంది.

పలాస కేంద్రంగా మూడేళ్ల పాటు రైతులు సాగించిన జీడి ఉద్యమంలో సిపిఎం కీలకపాత్ర పోషించింది. రైతులను సమీకరించి పెద్ద పోరాటాలకు రూపకల్పన చేసింది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర, ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలన్న డిమాండ్లతో అనేక రూపాల్లో ఆందోళనలు సాగించారు. గతేడాది జూలై 14న కవిటి మండల కేంద్రంలో జీపు జాతా ప్రారంభించి సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని పలు ఉద్దాన ప్రాంత గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి జీడి కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యాపారుల మోసంపై చైతన్యం కల్పించారు. గ్రామాల్లో కరపత్రాలను పంచి ప్రచారం నిర్వహించారు. జూలై 18న కాశీబుగ్గలో మహాధర్నా, కాశీబుగ్గ సంతమైదానంలో అదే నెల 27న 24 గంటల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఉద్దానం జీడి రైతు సంఘం చేపట్టిన పోరాటాలకు సిపిఎం అండగా నిలిచింది. పోరాటాలను ఉధృతం చేసి జీడిపిక్కల అంశాన్ని పాలక, ప్రతిపక్ష పార్టీలకు అజెండాగా మార్చింది. రైతుల ఆందోళనలు ప్రభుత్వం రైతులతో చర్చలు జరపడం, మద్దతు ధరపై ఒక నిర్ణయం తీసుకునేలా చేశాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటామని చెప్పేలా రైతుల పోరాటం పనిచేసింది. రైతుల పోరాటాలకు బాసటగా నిలవడంతో పాటు వారికి చైతన్యం కల్పించడంలో సిపిఎం చురుకైన పాత్ర పోషించింది.

కార్మికుల గొంతుకై...

పారిశ్రామిక కార్మికులు, స్కీమ్‌వర్కర్లు తమ సమస్యలపై సాగిస్తున్న పోరాటాలకు సిపిఎం ముందుపీఠిక నిలబడి పోరాడింది. వేతన ఒప్పందాలను అమలు చేయకుండా మొండికేసిన యాజమాన్యాలు దిగొచ్చేలా చేయడంలో తనవంతు పాత్ర పోషించింది. పరిశ్రమల నుంచి అన్యాయంగా తొలగించిన కార్మికులను తిరిగి పనుల్లో తీసుకునేలా చేసేందుకు అనేక ఆందోళనలు చేపట్టింది. గిరిజనుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెప్తున్నా, వారి ఆకాంక్షలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

బడ్జెట్‌లో గిరిజనులకు వాటాగా దక్కిన నిధులతోనే ఏవో మొక్కుబడిగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి వాటినే గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు. ఆదివాసీల సమస్యలను మాత్రం పాలకులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఏజెన్సీ ప్రాంతాల్లోని తమ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీలు ఏళ్ల తరబడి చేస్తున్న ఆందోళనలు అరణ్యరోదనగానే మిగిలింది. జిఒ నంబరు 3, భూముల అన్యాక్రాంతం వంటి అనేక అంశాలపై వారు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. గిరిజనులకు మద్దతుగా ఎపి గిరిజన సంఘం సాగిస్తున్న అనేక పోరాటాలకు సిపిఎం అడుగడుగునా అండగా నిలిచింది.

అభివృద్ధికి ప్రత్యామ్నాయాలు చూపిన సిపిఎం

జిల్లాలో కార్మిక, రైతాంగ పోరాటాలు సాగిస్తూనే జిల్లా అభివృద్ధికి సిపిఎం అనేక ప్రత్యామ్నాయాలు చూపింది. వ్యవసాయకంగా జిల్లాను అభివృద్ధి చేయాలంటే పుష్కలంగా ఉన్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని అనేకసార్లు నొక్కి చెప్పింది. జిల్లాలో వ్యవసాయ యోగ్యమైన భూమి 9.22 లక్షల ఎకరాలు ఉంది. ప్రస్తుతం 6.68 లక్షల ఎకరాలు మాత్రమే సాగులో ఉంది. మిగిలిన 2.62 లక్షల ఎకరాలు భూమి వృథాగా పడి ఉంది. వంశధార నదీ జలాల్లో జిల్లా వాటా 57.5 టిఎంసిల నీటి లభ్యత ఉన్నా 17.84 టిఎంసిల నీటిని మాత్రమే ఉపయోగించుకుంటున్న పరిస్థితి నెలకొంది. నాగావళి ద్వారా 16 టిఎంసిల నీటిని వినియోగించుకునే అవకాశమున్నా 4.5 టిఎంసిల నీటినే వాడుకుంటున్నాం. వీటిని సాగులో తీసుకురావాలంటే జిల్లాలో ఉన్న పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు మొరపెట్టుకుంది.

కాలుష్య కారక పరిశ్రమల స్థానంలో కాలుష్య రహిత, వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని పరిశ్రమలకు సంబంధించి మరో ప్రత్యామ్నాయం చూపింది. ఉద్దానం ప్రాంతంలో జీడి బోర్డు, కొబ్బరి పరిశ్రమ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించింది. జిల్లాలో 193 కిలోమీటర్ల మేర సుదీర్ఘంగా ఉన్న సముద్రతీరాన్ని ఉపయోగించుకునేందుకు అనేక ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది. భావనపాడు, కళింగపట్నం ఓడరేవుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం చేపడితే మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని గుర్తించింది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు విజ్ఞప్తి చేసింది. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాకు ఐటిడిఎ లేకుండా పోయింది. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేసి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించడం ద్వారా గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచవచ్చని చెప్తోంది.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలి

- పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి
- జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అన్ని శాఖలు సమన్వయంతో జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పార్టీలకతీతంగా అందరూ అభివృద్ధికి సహకరించి జిల్లా అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో స్థాయీ సంఘ సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. 2, 4, 7, 1 స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజలకు అందాల్సిన సేవలు, సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించడంలో అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రధానంగా సాగుతున్న ఉపాధి పనులను టెండరు ప్రక్రియ ద్వారా చేపట్టాలని జెడ్‌పిటిసి సభ్యులు టి.సీతారాం, ఎస్.నాగేశ్వరరావు సూచించారు. సిమెంట్ రోడ్లు, భవన నిర్మాణాలు ఇతర అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వైద్యారోగ్య శాఖ పద్దులపై సాగుతున్న పలు కార్యక్రమాలను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డిసిహెచ్‌ఎస్ కళ్యాణ్ బాబు వివరించారు. ఈనెల 14 నుంచి కేన్సర్‌పై ఇంటింటి సర్వే చేపడుతున్నామని, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. ఆరోగ్యశ్రీ, అవుట్‌సోర్సింగ్ నియామకాలపై జెడ్‌పి చైర్‌పర్సన్ ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి.ప్రకాశరావు ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవ ద్వారా 3,250 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తిస్తున్నట్లు వివరించారు. విద్యాశాఖపై జరిగిన సమీక్షలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి నాడు-నేడు కింద గత ప్రభుత్వం కేటాయించిన పనులకైన ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో బోర్లు తవ్వించుకున్నారని, రైతులకు విద్యుత్ సరఫరా అందించడం లేదని ఎమ్మెల్యే ప్రస్తావించారు. 3, 5, 6వ స్థాయీ సంఘ సమావేశాలకు పాలిన శ్రావణి , సిరిపురపు జగన్మోహనరావు అధ్యక్షత వహించారు. సంక్షేమ శాఖలతో పాటు ఐసిడిఎస్, వ్యవసాయానుబంధ రంగాలపై సమీక్షించారు. పోలాకి, జి.సిగడాం, ఎచ్చెర్ల తదితర మండలాల్లో సకాలంలో సాగునీరు అందక పంటలు దెబ్బతిన్నాయని, ఆ ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని సభ్యులు కోరారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి, విద్యుత్, నీటిపారుదల, సాంఘిక సంక్షేమ తదితర శాఖల అధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో భవిష్యత్ నాశనం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ యాక్ట్, డ్రగ్స్‌పై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయాల్లో ర్యాగింగ్ వీలైనంత వరకు జరగకుండా చూడాలని, అలా జరిగితే దానికి పూర్తి బాధ్యత ప్రిన్సిపాల్‌దేనని స్పష్టం చేశారు. విద్యార్థులు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, తల్లిదండ్రులకు పేరు తెచ్చే విధంగా ఉండాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని అరికట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిలు ఎ.రాము, మాధురి, తేజ చక్రవర్తి, ఎ.విజయ్ రాజ్‌కుమార్, కె.రాణి, న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, శివానీ కళాశాల సెక్రటరీ కె.దుర్గ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - నరసన్నపేట

మాట్లాడుతున్న సీతారాం

కార్తీక, మార్గశిర మాసాల్లో భారీ సంఖ్యలో వివాహాల నేపథ్యంలో బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక దృష్టిసారించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, ఐసిడిఎస్, జిల్లా బాలల సంరక్షణ విభాగాలు సంయుక్తంగా బాల్య వివాహాల నిర్మూలనలో అధికారుల పాత్రపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో బాల్య వివాహాల చట్టం, శిక్షలు, అపరాధ రుసుములపై పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారం అందిన తర్వాత నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ కేసుల నమోదుకు కమిషన్ సిద్ధంగా ఉందన్నారు. బాల్య వివాహాలపై apscpcr2018@gmail.com ఫిర్యాదులు అందిస్తే సత్వర చర్యలు చేపడతామన్నారు.

ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కె.నాగమణి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా అధిక సంఖ్యలో కళాజాతాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విస్తృతస్థాయి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకటరమణ, ఎంపిడిఒ బి.మధుసూదనరావు, ఎంఇఒ యు.శాంతారావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.జయశంకర్, ఎస్ఐ వై.సింహాచలం తదితరులున్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లో తల్లి పాల కేంద్రాల ఏర్పాటుకు కృషి

రాష్ట్రంలోని అన్ని ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లో చంటి పిల్లలకు పాలు పట్టేందుకు అన్ని వసతులతో కూడిన ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేసేందుకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సిద్ధంగా ఉందని కమిషన్ సభ్యులు సీతారాం తెలిపారు. నరసన్నపేట బస్ కాంప్లెక్స్ ప్రాంగణంలో తల్లిపాల ప్రత్యేక కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, మెకానికల్ సూపరింటెండెంట్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డిఎస్‌పిల నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు డివిజన్లకు కొత్తగా ఇద్దరు డిఎస్‌పిలను నియమిస్తూ డిజిపి ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెయింటింగ్‌లో ఉన్న డిఎస్‌పి జి.సీతారామారావును ఖాళీగా ఉన్న శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా నియమించారు. విజయవాడ పోలీసు కమిషనరేట్‌లో డిఎస్‌పిగా పనిచేస్తున్న వి.వి అప్పారావును కాశీబుగ్గ డిఎస్‌పిగా నియమించారు.

17 నుంచి ధాన్యం సేకరణ

- కొనుగోలు చేసిన 48 గంటల్లో డబ్బుల చెల్లింపు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి రైతులు పండించే ధాన్యాన్ని సేకరిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు, నాలుగు నెలలు సవాల్‌గా తీసుకుని ప్రతి ధాన్యం గింజ రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశా నుంచి ధాన్యం రాకుండా నివారించాలని ఆదేశించారు. గత ఐదేళ్లలో ధాన్యం సేకరణ సక్రమంగా చేయలేదన్నారు. జిల్లాలో కొన్ని రైస్‌మిల్లులను పక్కన పెట్టేవారని, అలాంటి వాటికి తావులేకుండా చూడాలన్నారు. మార్కెటింగ్, పిఎసిఎస్‌లు, స్వయం సహాయక సంఘాల ద్వారా సేకరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా ఉండకూడదని చెప్పారు. రైతులు ఎక్కడ కావాలంటే అక్కడ విక్రయాలు చేసుకోవచ్చన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. మార్కెటింగ్ శాఖ, పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్ సిబ్బంది చాలకపోతే సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరందక పంటలు పండని భూ వివరాలను అందజేయాలని ఆర్‌డిఒలను ఆదేశించారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఈనెల 17 నాటికి కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ కస్టోడియన్ అధికారులుగా సిఎస్‌టిడిలను నియమిస్తామన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు 2024-25 ధాన్యం సేకరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ఐదేళ్లలో సేకరించిన వివరాలను తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డి.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్తు రహిత జిల్లాగా మారుద్దాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటిని నిర్మూలించి మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే వాటి వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సిఒఆర్‌డి) కమిటీ సమావేశంలో ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి సమీక్షించారు. ఎస్‌పి మాట్లాడుతూ ఈ ఏడాదిలో ఇప్పటివరకు 37 కేసులు నమోదు చేశామని, 108 మందిని అరెస్టు చేయగా, అందులో ఇద్దరు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి సంకల్పం పేరిట కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, డి-అడిక్షన్ కేంద్రాల సేవలకు టోల్ ఫ్రీ నంబరు 14446 పనిచేస్తోందన్నారు. తమ సమస్యలు, ఫిర్యాదులు ఈ నెంబర్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. రెవెన్యూ ఇంటిలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజా పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఒడిశాతో సరిహద్దు ఉందని అధికారులకు స్మగ్లింగ్ అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి శ్రీనివాసరావు, ఆర్‌డిఒలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, గణేష్, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, పలు శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ కక్షసాధింపు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మాట్లాడుతున్న పేరాడ తిలక్

టిడిపి కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతోందని వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, కింజరాపు అచ్చెన్నాయుడు మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే టెక్కలి నియోజకవర్గంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిఎఫ్‌లు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, పారిశుధ్య కార్మికులు ఇలా 400 మందిని తొలగించారని చెప్పారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్చెన్నాయుడు అండదండలు చూసుకొని ఆ పార్టీ నాయకులు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి అథధికారుల వరకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని, మరోవైపు శాంతిభద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తారు. మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. టిడిపి ప్రభుత్వం ప్రజలకు ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వైసిపి నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, వైసిపి నాయకులు ఎస్.హేమసుందరరాజు, నూక సత్యరాజు, బోయిన నాగేశ్వరరావు, దుక్క రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతే జీవితానికి రక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రహదారి భద్రతే జీవితానికి రక్షణగా నిలుస్తుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశాన్ని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, డిటిసి విజయసారథితో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరం నుంచి నరసన్నపేట వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులు ఇకపై గోపీనగరం వైపు రాంగ్ రూట్‌లో జాతీయ రహదారి పైకి వెళ్లరాదని, సర్వీసు రోడ్డులో వెళ్లాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆర్‌టిసి బస్సులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశాలున్న రహదారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కఠినతరం చేయాలన్నారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో, 158 సున్నితమైన ప్రాంతాల్లో చేపట్టిన రక్షణ చర్యలపై చర్చించారు. ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని చెప్పారు. నిర్లక్ష్యంగా ఉంటే సంబంధిత ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయాల్లో సేవలు సకాలంలో అందేలా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 1033 హెల్ప్‌లైన్ బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలని, కాల్ సెంటర్‌లో తెలుగు మాట్లాడే వారు ఉండేలా చూడాలని చెప్పారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

పలాస : కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 17 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తనకు చేసిన ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. కుటుంబ కలహాలకు సంబంధించి రెండు, సివిల్ అంశాలు ఐదు, పాత ఫిర్యాదులు 2, మోసపూరితమైన అంశాలు ఒకటి, ఇతర అంశాలకు సంబంధించి 7 వినతులు వచ్చాయని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ప్రతి శుక్రవారం కాశీబుగ్గ సబ్ డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందన్నారు.

మాట్లాడుతున్న విసి రజిని

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

ఎచ్చెర్ల : క్యాంపస్ జీవితం ఎంతో విలువైనదని, క్రమశిక్షణతో మెలిగి ఉజ్వల భవిష్యత్‌ను విద్యార్థులు అందుకోవాలని బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజని సూచించారు. వర్సిటీ ఆంగ్ల విభాగం శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపిక చేసుకున్న సబ్జెక్టుతో పాటు కంప్యూటర్ విజ్ఞానం, సమకాలిన అంశాలు వంటి వాటిపై పట్టు సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించాలన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, ఆంగ్ల విభాగ సమన్వయకర్త డా. పి.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువపై పలకలు వేయిస్తున్న సర్పంచ్ ప్రతినిధి

కాలువపై పలకలు వేశారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

పోలాకి: ఇటీవల 'పలకలు వేసేదెప్పుడు' అనే శీర్షికన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కాలువలపై పలకలు వేసి సమస్యను పరిష్కారం చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. పోలాకి పంచాయతీలో వెదుళ్ళవలస గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న రహదారికి ఆనుకుని కాలువపై పలకులు తొలగించి అధ్వాన్నంగా నెల రోజుల పాటు వదలేశారు. దీంతో స్థానిక ప్రజలు, పాఠశాల విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దానిపై ప్రజాశక్తి కథనం ప్రచురించడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కారం చేశారు.

అనధికార ఆక్వా సాగుపై చర్యలు

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో ప్రభుత్వ భూముల్లో అనధికార ఆక్వా సాగు నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంగా కృషి చేయాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయంలో సబ్ డివిజనల్ లెవెల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతబొమ్మాళి మండలంలో జాయింట్ సర్వే నివేదిక ప్రకారం 460 ఎకరాల ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా సాగు చేస్తున్నట్లు గుర్తించారు. ఆక్వా రైతులు వెంటనే వాటిని తొలగించాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వ భూములను ఆక్రమించిన రైతులు వాటిని యథాస్థితిలో ప్రభుత్వానికి అప్పగించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, మత్స్యశాఖ, నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ, కాలుష్య నియంత్రణ, భూగర్భ జల, అటవీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

24, 25న యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ప్రజాశక్తి- మందస

హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో యుటిఎఫ్ మందస మండల శాఖ అధ్యక్షులు జగదీష్ బడిత్య అధ్యక్షతన జిల్లా యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా విద్య వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, హరిపురం వేదికగా నవంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించేందుకు రాష్ట్ర శాఖ ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. నిర్వహణ బాధ్యత వహిస్తున్న యుటిఎఫ్ మందస మండల శాఖకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరవుతున్న విద్య వైజ్ఞానిక మహాసభలకు

మాట్లాడుతున్న కిషోర్‌కుమార్

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు ఉపాధ్యాయ, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై దిశా నిర్దేశం చేస్తూ ఆమోదం పొందిన పలు తీర్మానాలు ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ స్వర్ణోత్సవ మహాసభలు ఉపాధ్యాయుల్లో చైతన్యం నింపడంతో పాటు విద్యాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె వైకుంఠరావు, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, అకడమిక్ సెల్ కన్వీనర్, కో కన్వీనర్లు ఎల్ వి చలం, కె మాధవరావు, పూర్వపు జిల్లా కార్యదర్శులు ఆర్. పరమేశ్వరరావు, కె రమేష్, మందస, పలాస శాఖల ప్రధాన కార్యదర్శులు దాసరి ఈశ్వరరావు, ఎస్ వి రమణ, సిద్దేశ్వరరావు తదితరులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ యుటిఎఫ్ నాయకులు జె సోమేశ్వరరావు, ఎల్.రాజారావు, కె.శ్రీనివాసరావు, రామారావు, జి రమణబాబు, ఎం.శివకేశవరావు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

కొత్తూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి అన్నారు. శుక్రవారం న్యాయసహాయ దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమములో సిబ్బంది పాల్గొన్నారు.

కురిగాం వసతిగృహం తనిఖీ

కొత్తూరు: మండలంలోని కురిగాంలో ఉన్న ఎస్‌సి హాస్టల్‌ను వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు శుక్రవారం తనిఖీ చేశారు. వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వసతిగృహంలో ఎవరూ లేకపోవడంతో వసతిగృహం పనితీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు శ్రీను ఉన్నారు.

పోస్టాఫీస్‌లో ఖాతా తెరవాలి

టెక్కలి రూరల్ : ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పోస్టాఫీస్‌లో ఖాతా తీసుకుంటే లావాదేవీలకు వీలుగా ఉంటుందని పోస్టుమాస్టర్ ఎన్.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు ఎన్‌పిసిఎల్ లింక్ అవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే పోస్టాఫీస్‌లో అకౌంట్ తెరిస్తే నేరుగా ఖాతాలోకి జమవుతాయన్నారు. పోస్టాఫీస్‌లో రెండు వందలతోనే ఖాతా తెరవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నందిగాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందేందుకు ఎన్‌పిసిఐ లింకు కోసం కేవలం రూ.200 చెల్లించి పోస్టాఫీస్‌లో ఖాతా పొందవచ్చునని పోస్ట్ మాస్టర్ షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పోస్టల్ అకౌంట్‌కు పొందే వీలుంటుందని తెలిపారు.

ఎఐపై అవగాహన అవసరం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు మెడికల్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న బొల్లినేని మెడిస్కిల్‌లో హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన హెచ్‌ఆర్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతమైంది. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ సిఇఒ ఇంతియాజ్ అర్షద్ మాట్లాడుతూ హెచ్‌ఆర్ మేనేజర్లు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తేనే రాణించగలుగుతారన్నారు. నేవల్ డాక్‌యార్డ్ హెచ్‌ఆర్ మేనేజర్ కమాండర్ అర్జున్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పోటీ ప్రపంచంలో ఎఐ టెక్నాలజీపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీలు, హోటళ్లు, ఆస్పత్రుల హెచ్‌ఆర్ మేనేజర్లు, ఎస్‌డిఐ, బొల్లినేని సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం అర్బన్: గడచిన ఐదేళ్లలో మౌళిక వసతులు సమకూర్చడంలో ప్రభుత్వ వైఫల్యం చెందిందని, గ్రామీణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు సమకూరుస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలం పాత్రునివలసలో రూ.52 లక్షలతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పల్లెల్లో రోడ్లు, కాలువలు వంటి కనీస సౌకర్యాల మరమ తులకు నిధులు వెచ్చించలేదన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

పొందూరు: మేజర్ పంచాయతీ పరిధిలోని తాపీమేస్త్రి, కుమ్మరి కాలనీల్లో సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. పనులకు శంకుస్థాపన చేయడంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఎంపిటిసి-4 బాడాన హారిక, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు శేషగిరి, పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి శ్రీరంగనాయకులు, ఇఒ మోహన్‌బాబు, విజయలక్ష్మి, బలగ శంకరభాస్కరరావు, కాలెపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం కురిగాం పంచాయతీ మహాదేవ పురంలో సిసిరోడ్డుకు వైస్ ఎంపిపి తులసీ వర ప్రసాదరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు శేపాన విక్రమ్, మనోజ్, తేజ, పాల్గుణ, పోతల నీలమణి, శేషగిరి నాయుడు, రమేష్ తదితరులున్నారు.

పౌష్టికాహారం అందజేస్తున్న నాయకులు

పౌష్టికాహారం పంపిణీ

కవిటి: మండలం ముత్యాలపేటలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం లోపంతో బాధపడకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతినెల పోషకాహారం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆర్. నారాయణరావు, ఆర్.సీతారామమూర్తి, కె.కృష్ణారావు, పి.జగదీష్, జి.శ్యామలరావు, అంగన్వాడి కార్యకర్త పి. మీన, ఆశా కార్యకర్త డి.చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవడమే ఎమ్మెల్యే కూన రవికుమార్ లక్ష్యమని మండల తెలుగు యువత అధ్యక్షులు తాడేల రాజారావు అన్నారు. శుక్రవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రొట్టవలస ఎగువ ప్రాంత భూములకు వంశధార కుడి కాలువ సాగునీరు అందక రైతులు ప్రతిఏడాది నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే రవికుమార్ ఇరిగేషన్ డిఇఇ కామరాజు, ఎఇ పి.శ్రీనివాసులను పంపించి సర్వే చేయించారని దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వంశధార కుడి ప్రధాన కాలువ నుంచి ఉన్న 17ఎల్ కాలువ నుంచి సుమారు వెయ్యి మీటర్లు పైపులు ఏర్పాటు చేస్తే 100 ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందుతుందని

కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఇరిగేషన్ అధికారులకు తనతో పాటు గ్రామ రైతులు, తొత్తడి వైకుంఠరావు, దొనకొండ దాలినాయుడు, బెవర లక్ష్మణరావు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ ఎత్తిపోతల పథకంపై ఎన్నికల ప్రచారంలో రవికుమార్‌కు మాజీ ఎంపిటిసి తాడేల వెంకటరమణమూర్తి, గ్రామ రైతులు తెలియజేయగా అప్పట్లో ఆయన సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు నేడు ఎమ్మెల్యే రవికుమార్ చొరవ చూపి ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్నారని రాజారావు ఆనందం వ్యక్తం చేసారు.

న్యాయం చేయాలని వివాహిత ఆందోళన

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సుభద్ర నగర్ వీధిలో నివాసముంటున్న తంగుడు హరికృష్ణ ఇంటి ముందు భార్య కవిత ఆందోళన చేపట్టింది. కొడుకు మానసిక వికలాంగుడు కావడంతో భార్య, కొడుకు అవసరం లేదని చెప్పడంతో తల్లిదండ్రులు, కుటుంబీకుల సహాయంతో ఆ మహిళ తాళాలు విరగ్గొట్టి ఇంటిలోకి ప్రవేశించే యత్నం చేశారు. బాధిత మహిళ కథనం మేరకు శ్రీకాకుళం పట్టణానికి చెందిన పొట్నూరు లక్ష్మణరావు, హైమావతి కుమార్తె కవితకు 2013లో కాశీబుగ్గ (స్టేట్బ్యాంకు వీధి) సుభద్ర నగర్‌కు చెందిన హరికృష్ణతో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలతో పాటు బంగారు ఆభరణాలు భారీస్థాయిలో అందించారు. వీరి దాంపత్య జీవితం సజావుగా కొన్నాళ్లపాటు సాగింది. వీరికి కుమారుడు జైశ్రీరామ్ అనే పదేళ్ల బాలుడు ఉన్నాడు. పుట్టిన నుంచి ఆయన బుద్ధిమాంద్యంతో ఉండడంతో భార్యాభర్తలు మధ్య పొరపొచ్చాలు ప్రారంభమయ్యాయి. అత్తమామలు కూడా వత్తాను పలకడంతో ఆమె పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారింది. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిన కవితని తిరిగి రప్పించలేదు. కనీసం ప్రయత్నం కూడా చేయలేదు. బుద్ధి మాంధ్యంతో పుట్టిన బాలుడితో వేగలేమని, ఎలాగైనా కవితను వదిలించుకోవడానికి చేయని ప్రయత్నం కూడా లేదు. ఇదిలా ఉండగా తన భర్తే తనకు సర్వస్వమని, ఆయనతోనే తన జీవితమని, తనకు న్యాయం చేయాలని విన్నవించుకుంది. తాను కాశీబుగ్గ వచ్చానని తెలుసుకున్న అత్తవారింటి వారు తలుపులు తాళాలు వేసుకొని ఆరుబయటే పెట్టారు. తనతో పాటు తన తల్లిదండ్రులు, కుటుంబీకులు కూడా రోడ్డుపైనే నిలబడాల్సి వచ్చింది. జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డికి ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. గేట్లు తాళాలు విరగ్గొట్టి తల్లిదండ్రులు, కుటుంబీకులు లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. అయినా హరికృష్ణ తల్లిదండ్రుల నుంచి ఎటువంటి స్పందన లేదు. చివరకు ఇరువైపులా పెద్దలు సమన్వయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

భర్త ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న కవిత

బాధితురాలికి బాసటగా ఎమ్మెల్యే

బాధితురాలు కవితకు న్యాయం చేయాలని జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాధితురాలికి ఎస్‌పి భరోసా ఇచ్చారని, భార్య భర్తవద్దే ఉండాలని, ఆమె ఒక ఆడపిల్లని అత్తమామలు గుర్తించాలన్నారు. బిడ్డ బుద్ధిమాంద్యంతో పుట్టాడని విడిచిపెట్టాలని యోచించడం అన్యాయమని, ఆమెకు ఎటువంటి ఇబ్బందులు కలిగించినా తాము తీవ్రంగా స్పందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. భర్త, అత్తమామలు ఆమెకు జాగ్రత్తగా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

ఆర్‌డిఒ కార్యాలయానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- పలాస

మండల పరిషత్ కార్యాలయ ఆవరణ కాశీబుగ్గ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 227/5లో ఆర్‌డిఒ నూతన కార్యాలయం నిర్మాణానికి శుక్రవారం ఆర్‌డిఒ వెంకటేష్ స్థల పరిశీలన చేశారు. ఆయనతో పాటు తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, మండల సర్వేయర్ గిరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జ్యుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం, గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ఫోక్సోచట్టం వంటి పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటరావు, న్యాయవాదులు బ్రహ్మాజీ, రాము పాల్గొన్నారు.

రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న రామారావు

రోడ్డు పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పోలేరు పంచాయతీ కొండ పోలేరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు పనులను టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇప్పటికే ఆ దిశగా నిధులు మంజూరు సైతం జరిగిందన్నారు ఈ పరిశీలనలో ఆయనతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'గ్లోబల్'లో ఇంటర్ విద్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్లోబల్ విద్యాసంస్థలు మరో మైలురాలు చేరటానికి 2025-26 సంవత్సరంలో గ్లోబల్ జూనియర్ కాలేజ్ డే, రెసిడెన్షియల్ క్యాంపస్‌లను స్థాపిస్తున్నట్టు యాజమాన్యం తరపున ప్రసాద్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం స్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించగల సామర్థ్యం సంస్థకు ఉందని ఆయన వివరించారు. విద్యాబోధన, ప్రతి తరగతి గదిలో 29 మంది విద్యార్థులు మాత్రమే ఉండే విధంగా, రెండు దశాబ్దాలు అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యా బోధన అందించడం, డౌట్స్ క్లారిఫికేషన్ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఫ్యాకల్టీ, విద్యార్థినిలపై ఒత్తిడి లేకుండా రూపొందించే అకడమిక్ కరిక్యులం, ప్రతి విద్యార్థిపై వ్యక్తి గత శ్రద్ధతో పిల్లలను ర్యాంకులు సాధించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థను ప్రోత్సహించాలన్నారు.

మాట్లాడుతున్న ప్రసాద్

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు

- పాము కాటుకు బలైన యువకుడు
- వృద్ధ తల్లిదండ్రులకు తీరని శోకం
- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు

హరీష్ (ఫైల్)

అందివచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోయాడు. చదివిన చదువుకు ఉద్యోగం రాకపోయినా, అమ్మ నేనున్నా కాయకష్టం చేసిన కుటుంబాన్ని పెంచుతానమ్మ అధైర్య పడొద్దు. అండగా ఉంటానని భరోసా ఇచ్చిన కొడుకు పనికి వెళ్లి వస్తానని చెప్పిన తమ బిడ్డకు అంతలోనే విషసర్పం రూపంలో మృత్యువు కాటేసిందని, తమ గారాల బిడ్డ అందనంత ఎత్తుకు అనంత లోకాలకు వెళ్లిపోయాడని తెలియడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపిస్తున్నారు.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన కొత్తకోట హరీష్ (25) శుక్రవారం పాము కాటుకు గురై మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన వివరాలు ప్రకారం హరీష్ శుక్రవారం ఉదయం వ్యవసాయ పంట క్షేత్రం వద్ద కోతలు జరుగుతున్న సమయంలో హరీష్‌ను పాముకాటు వేయడంతో ఇది గుర్తించిన స్థానికులు వెంటనే పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు అయితే మార్గమధ్యంలో హరీష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

అందివస్తాడనుకుంటే...

నిరుపేద కుటుంబానికి చెందిన తాము కొడుకును ఉన్నత చదువులు చదివించినప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో తమను ఓదార్చి ఉద్యోగం రాకపోయినా కష్టపడి కుటుంబాన్ని పెంచుతానని భరోసా ఇచ్చాడని హరీష్ తల్లిదండ్రులు పద్మావతి, సింహాచలం తెలిపారు. రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వరికోత మిషన్ కొనుగోలు చేసుకుని తనే వరి కోతల పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. అయితే విధి తమపై చిన్నచూపు చూసిందని బోరిన విలపించారు. వృద్ధాప్యంలో తమకు తోడు నీడగా ఉంటాడన్న ఒక్కగాన ఒక్క కొడుకుని విషసర్పం రూపంలో బలి చేసిందన్నారు. తమకు ఉన్న ఇద్దరు కుమార్తెలను వివాహం చేశామని, ఉన్న ఒక్క కొడుకు అందని లోకాలకు వెళ్లిపోయాడని, ఇప్పుడు తమకు దిక్కెవరని బోరున వినిపించారు.

గ్రామంలో విషాదఛాయలు

ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ అందరితోనూ కలివిడిగా ఉంటూ మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకుని, తన స్వయం కృషితో కుటుంబాన్ని పోషించుకుంటూ ఆదర్శంగా నిలిచిన హరీష్ మృత్యువాత పడడంతో తోటవాడలో విషాదఛాయలు అలముకున్నాయి.

మృతి చెందిన దివ్యాంశ్

బస్సు కింద పడి బాలుడు మృతి

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని ముండల గ్రామంలో శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు ఆర్‌టిసి బస్సు వెనుక చక్రాల కింద పడి రెండున్నర ఏళ్ల బాలుడు దివ్యాంశ్ ప్రధాన్ మృతి చెందాడు. స్థానికులు, కంచిలి పోలీసుల వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలోని జక్కర గ్రామానికి చెందిన బసంత్ ప్రదాన్‌కి ముండల గ్రామానికి చెందిన సంగీతతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. బసంత్ ఉపాధి నిమిత్తం వేరే దేశంలో వలస కూలీగా పనిచేస్తున్నాడు. సంగీత తన ఇద్దరు పిల్లలతో ముండల గ్రామంలో తన తల్లి వద్ద ఉంటోంది. శుక్రవారం ఉదయం దివ్యాంశ్ ఆటలాడుకుంటూ వీధిలోకి వెళ్ళాడు. అదే సమయంలో కెబి నౌగాం నుంచి కంచిలి వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వెనుక చక్రాల కింద ప్రమాదవశాత్తు పడిపోయాడు. అది గమనించని డ్రైవర్ ముందుకు వెళ్లడంతో బాలుడు పైనుంచి బస్సు వెళ్లింది. స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో బస్సు నిలుపుదల చేశారు. అయితే అప్పటికే తీవ్ర గాయాలైన బాలుడు మృతి చెందాడు. ఇది తెలిసిన తల్లి సంగీత బాలుడిని పట్టుకొని తీవ్రంగా రోధించింది. అప్పటివరకు ఇంట్లో ఆడుతూ పాడుతూ తిరుగుతున్న కొడుకు ఆకస్మాత్తుగా మృత్యు ఒడిలోకి చేరడంతో ఆ తల్లిని ఓదార్చడం ఎవరివల్ల కాలేదు. రక్తపు మడుగులో బాలుడిని చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యాంతమయ్యారు. సంఘటనపై కంచిలి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం జర్జంగి గ్రామానికి చెందిన బోనె అప్పన్న (28) మృతి చెందాడు. అప్పన్నతో పాటు మరో ఇద్దరు యువకులు ఉమ్మిలాడ బీచ్‌కు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా పోలాకి మండలం బార్జిపాడు, కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం గ్రామాల మధ్యలో గల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాను బలంగా ఢీకొనడంతో అప్పన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పన్నకు భార్య లక్ష్మి, కుమారుడు అభిరాం, కుమార్తె హారిక, తల్లిదండ్రులు జగ్గారావు, ఉత్తరమ్మలు ఉన్నారు. అప్పన్న లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషణ చేస్తున్నాడని, ఆయన మృతిలో కుటుంబం రోడ్డున పడిం దని కుటుంబసభ్యులు, బంధువులు రోధిస్తున్నారు. దీనిపై పోలీ సులకు సమాచారం రాలేదని ఎస్ఐ సత్యన్నారాయణ తెలిపారు.


అప్పన్న (ఫైల్)

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పలాస: సోంపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు జిఆర్‌పి హెచ్‌సి హరినాథ్ శుక్రవారం తెలిపారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే 9440627567 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారును ఢీకొన్న లారీ

కంచిలి: మండలంలోని జాడుపూడి జాతీయ రహదారి వద్ద శుక్రవారం ఉదయం విశాఖపట్నం నుంచి పూరి వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తమిళనాడులోని మధురైకి చెందిన సత్తి వేల్ నబిరాజ్‌తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కంచిలి పోలీసులు వివరాల మేరకు మధురైకి చెందిన సత్తి వెల్ నబిరాజ్ ఉద్యోగరీత్యా కుటుంబంతో కలిసి విశాఖపట్నంలో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కారులో పూరి జగన్నాథ స్వామిని దర్శించుకునేందుకు బయలుదేరాడు. కంచిలి మండలం జాడుపూడి గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ కారుని ఢీకొంది. దీంతో కారు డివైడర్ మధ్యలో ఉన్న సిసి కెమెరా స్తంభానికి బలంగా ఢీకొని పల్టీ కొట్టింది. అయితే కారులో ఉన్న బెలూన్స్ విచ్చుకోవడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్వల్ప గాయాలతో వారంతా బయట పడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గాయాలపాలైన క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనపై కంచిలి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలం వద్ద బాధితులు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలం అయోధ్యపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. రహదారికి అడ్డంగా కుక్క రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పలాస : మండలంలోని పాత జాతీయ రహదారి గరుడఖండి, గోపాలపురం గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలం మహాదేవపురానికి చెందిన అప్పలస్వామి, కృష్ణ ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ వెనుక భాగం తగలడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. సంఘటన జరిగిన వెంటనే 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- పొందూరు

మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సమైక్య సంఘాలకు సామాజిక పెట్టుబడి నిధి చెక్కును అందజేశారు. మండల సమైక్య పరిధిలోని 18 గ్రామ సంఘాలకు రూ.39లక్షల సామాజిక పెట్టుబడి నిధి చెక్కును ఆయన అందజేశారు. ఈ పెట్టుబడి నిధులతో మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎసి పి.రవికుమార్, ఎపిఎం ఆర్.రాంమూర్తి, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు పైడి అరుణ, కోశాధికారి జడ్డు లక్ష్మి, సిసిలు సూర్యప్రభ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి- పలాస

అధికారులు విధులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అంతా ప్రజా సేవకులమేనని, వారికి ఎటువంటి కష్టం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఒబిసి, కుల, ఆదాయ ధ్రువపత్రాలను సచివాలయ, రెవెన్యూ సిబ్బంది త్వరితంగా అర్జీదారులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, తహశీల్దార్లు కళ్యాణ్ చక్రవర్తి, ఎంపిడిఒలు వసంత కుమార్, ఎన్.రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఘనంగా మాదారపు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వచ్ఛంద సంస్థలతో పాటు నందమూరి కుటుంబ హీరోల అభిమానసంఘాల నాయకునిగా, నగర టిడిపి అధ్యక్షునిగా మదారపు వెంకటేష్ అందిస్తున్న సేవలు ప్రశంస నీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆయన పుట్టిన రోజుల వేడుకల్లో భాగంగా అభిమానులు డేవిడ్ మిత్ర బృందం ఆధ్వర్యాన న్యూ బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శంకర్ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ, రోగులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సురేంద్ర, సురేష్, మహేష్, భాస్కర్, దుర్గా, మోహన్, వెంకీ, జనార్ధన తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న ట్రూ అప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యన్నారాయణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదనపు ఇంధన చార్జీల పేరిట ట్రూ అప్ భారం ప్రతిపాదిస్తూ విద్యుత్ పంపిణీ సంస్థలు నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయం అన్నారు. ఇప్పటికే రూ. 6072 కోట్లు వినియోగదారుల మీద మోపారని, ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచ బోమని చెపుతూనే గత ప్రభుత్వ బారమంటూ మరో రూ.11 వేల కోట్ల మేర వినియోగ దారులకు వడ్డించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులపై భారాన్ని మోపితే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు చాపర సుందర్ లాల్, జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సహాయ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

పలాస : కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సూదికొండకాలనీలో ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధిబారిన పడి అనేకమంది మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పాలకులు ఈ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కిడ్నీవ్యాధి మూలాలు ఇప్పటికీ తెలుసు కోలేకపోడంపై విచారం వ్యక్తం చేశారు. కిడ్నీ ఆస్పత్రిలో సాధారణ వైద్యమే అందిస్తున్నారని, పరిశోధన చేయడానికి శాస్త్రవేత్తలు లేకపోవడం ఇందుకు ఉదాహరణ అన్నారు. భవిష్యత్ తరాలను కాపాడేందుకు ఉద్దానం కిడ్నీ వ్యాధులపై ప్రభుత్వం స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జె.వీరాస్వామి, ఎం.భీమారావు, టి.సరస్వతి. పి.షణ్ముకరావు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టరాదు

ఇచ్ఛాపురం: బాలలను పనుల్లో పెట్టరాదని షాపుల యాజమానులకు చైల్డ్‌లైన్ సిబ్బంది సూచించారు. చైల్డ్ ఇన్ స్ట్రీట్ సిచ్చువేషన్‌లో భాగంగా శుక్రవారం మండలంలో, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ షాపుల్లో తనిఖీ చేసి షాపుల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. బాలలను పనిలో వుంచరాదని, 18 ఏళ్లలోపు వ్యక్తులు షాపుల్లో ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలను షాపు యాజమాన్యాలపై తీసుకోవడం జరుగుతుందని చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో ఎఎల్ఒ విజయకుమార్, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ వైకుంఠరావు అవగాహన కల్పించారు. ఈ తనిఖీలో ఐసిపి ఎస్.మీనాక్షి, బ్రెడ్స్ మండల కో-ఆర్డినేటర్ స్వాతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్ఆర్‌యుసిసి సభ్యునిగా రంగా రౌలో

కవిటి: మండలం జాడపూడి ఆర్ఎస్‌కు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రంగా రౌలోకు తగిన గుర్తింపు లభించింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ (జెడ్ఆర్‌యుసిసి) కమిటీలో సభ్యుడిగా రంగా రౌలో పేరును రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా రౌలో మాట్లాడుతూ ఒకే పార్టీని నమ్ముకుని, నిస్వార్థంగా చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించిందని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా తనని గుర్తించి రైల్వే జోన్‌లో సభ్యుడిగా ఎంపిక చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులతో పాటు కూటమి నాయకులు రంగా రౌలోకు అభినందనలు తెలిపారు.

వెంటపూరులో అన్నదానం

నందిగాం: నందిగామ పంచాయతీ పరిధిలోని వెంటపూరులో నూతనంగా నిర్మించిన తాటి పోలమ్మ గ్రామ దేవత ఆలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది యాత్రికులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

లావేరు : శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 15 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారికి అక్షరాభ్యాసం నేర్పించాలని ఉల్లాస్ కార్యక్రమం ప్రవేశపెట్టిందని మండల పరిషత్ ఎఒ రాజేశ్వరమ్మ, ఎపిఎం త్రినాథమ్మ అన్నారు. పదిమంది డ్వాక్రా మహిళలకు ఒక వాలంటీర్ చొప్పున మండలంలోని 1,118 మందికి 111 మంది వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మహిళలకు అవసరమైన అక్షరాస్యతను నేర్పించాలని, తదితర విషయాలపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీరన్నాయుడు, సిఎఫ్‌లు, విఒఎలు పాల్గొన్నారు.

లావేరు: నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ పి.వెంకట్ రాజు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై మండలస్థాయి వాలంటీర్లుకు శిక్షణ నిర్వహించారు. ఎపిఎం సుబ్బయ్య నాయుడు, వయోజన విద్యా సూపర్ వైజర్ రమణమ్మ, సిసిలు విజయకుమారి, రమేష్, జానకి, పెంటయ్య, మోహన్, శ్రీదేవి, విఒఎలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం

ఇచ్ఛాపురం: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ రామారావు, వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిసిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ పథకంపై స్వయం సహాయక సంఘాల విఒఎలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మీసాల మన్మధరావు, ఎపిఎం రాంమూర్తి, సిసిలు పాల్గొన్నారు.

నీమస్త్రం తయారు చేస్తున్న సిబ్బంది

నీమస్త్రంతో పురుగు గుడ్ల నివారణ

ప్రజాశక్తి- కవిటి

అన్ని రకాల పురుగు గుడ్ల నివారణకు, ఆకు తేనే పురుగు నివారణకు నీమస్త్రం బ్రహ్మాస్త్రంలా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి తులసయ్య తెలిపారు. మండలం గొర్లెపాడు, ఖాజూరు గ్రామాల్లో శుక్రవారం నీమస్త్రం తయారీ విధానం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ నీమస్త్రం రెండు కేజీల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 10 కేజీల వేపాకుల ముద్దను 200 లీటర్ల నీటిలో వేసుకొని ఉదయం, సాయంత్రం కర్ర సహాయంతో సవ్య దిశలో కలుపుకోవాలని సూచించారు. అనంతరం ఈ మిశ్రమం 48 గంటలు కలియబెట్టిన తర్వాత పంటపై పిచికారి చేసుకోవాలని సూచించారు. పురుగు గుడ్లు, ఆకు తేనే పురుగు నివారణలో ఈ మిశ్రమం అద్భుతంగా పనిచేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు, స్వాతి, శ్రీదేవి, సంతోషి, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని అర్జునవలసలో ప్రకృతి వ్యవసాయ వనరులు, శిక్షణ, విస్తరణ కేంద్రంలో 200 లీటర్లు దశపరణి ద్రావణం తయారీపై ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ ద్రానణం పిచకారి చేయుడం వలన చిన్న పురుగులు నుంచి పెద్ద పురుగులు కూడా నివారణ చేయువచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిజిటల్ కార్యకర్త శివశంకర్, ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు సత్యవతి, రామలక్ష్మి, సూర్యకాంతం, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం : దశపరణి ద్రావణం తయారు చేస్తున్న సిబ్బంది

మొక్కజొన్న సాగుపై అవగాహన

పొందూరు: మండలం రాపాకలో ప్రకృతి వ్యవసాయ విధానంలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటకు ఆశించే కత్తెర పురుగు నివారణకు విషముషిడి కాషాయం తయారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మల్లేష్, రవికుమార్, డిఎంఎంటి భాస్కరరావు, ఐసిఆర్‌పి సురేష్, వసంత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. ఎంత కష్టం

- జిబి సిండ్రోమ్ వ్యాధితో వలస కూలీ వేదన
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- కవిటి

ఇద్దరు చిన్నారులు, తననే నమ్ముకుని వచ్చిన భార్యను చక్కగా చూసుకోవాలన్న లక్ష్యంతో వలస కూలీగా మారిన ఆయనకు జిబి సిండ్రోమ్ వ్యాధి కోలుకోలేని దెబ్బ తీసింది. నర నరాలకు సోకిన ఆ వ్యాధి అతని కాళ్లు, చేతులు చచ్చుబడిపోయేలా చేసి మంచానికే పరిమితం చేసింది. దీంతో రెక్కాడితేగాని డొక్కాడని అతని కుటుంబం ప్రస్తుతం దాతల సాయంకోసం ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళితే కవిటి మండలం జి.కరాపాడు గ్రామానికి చెందిన నర్తు జగ్గారావు వలస కూలి. ఇటీవల జిబి సిండ్రోమ్ అనే వ్యాధికి గురై మంచానికే పరిమితమైపోయాడు. ఆత్మీయులు చొరవ తీసుకుని శ్రీకాకుళంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించారు. నలుగురిలో మంచి పేరున్న జగ్గారావు కింద

చికిత్స పొందుతున్న జగ్గారావు

హితులు, సన్నిహితులు అందించిన ఆర్థిక సాయంతో ఇప్పటివరకు సుమారు నాలుగు లక్షలు ఖర్చయింది. వ్యాధి పూర్తిగా నయం కావడానికి ఆరు నెలలకు పైగా పడుతుందని, నిరంతరం వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాలని వైద్యులు చెప్పినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అంతే కాకుండా పూర్తిగా నయమయ్యేసరికి మరో రూ.ఆరు లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ప్రస్తుతం జగ్గారావు కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. ఇప్పటికే చాలామందికి రుణపడిపోయామని, ఇప్పుడు తమకు దిక్కెవరని జగ్గారావు భార్య స్వాతి రోధిస్తోంది. దయగల హృదయాలు నిండు మనసుతో ఓ కుటుంబాన్ని నిలబెట్టాలని తడి ఆరని కళ్లతో అర్థిస్తోంది. ఆర్థికసాయం అందించేవారు ఎస్.బి.ఐ ఎకౌంట్ నెంబర్: 20027694352, ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్.బి.ఐ.ఎన్0008820 లేదా ఫోన్ పే 8179389330 నెంబర్లకు ఆర్థికసాయం అందించాలని కోరుతోంది.

వ్యాసరచనలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నరసన్నపేట

శ్రీసత్యసాయి 99వ జన్మదిన వేడుకల సందర్భంగా రాష్ట్ర సత్యసాయి సంస్థల నిర్వహణలో జరిగిన వ్యాసరచన పోటీల్లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయిలో సిహెచ్ సాయి కోమల్ మాధవి ద్వితీయ స్థానంలో నిలవగా సమితి స్థాయిలో పి హేమలత, కె.మేనక విజేతలుగా నిలిచారని శ్రీ సత్య సాయి సేవా సంస్థల నరసన్నపేట జోనల్ కన్వీనర్ వివిఎస్ఎన్ మూర్తి తెలిపారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్, మహిళా సేవాదళ్ కో-ఆర్డినేటర్ అమ్మాయమ్మ, సమితి కన్వీనర్ ఎంఎల్ నాయుడు, అప్పలస్వామి విద్యార్థులను అభినందించారు.

గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి గ్రామంలో సిసి రోడ్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు మండల టిడిపి మత్స్యకార నాయకుడు వంక రామారావు అన్నారు. శుక్రవారం పల్లివూరు పంచాయతీ చిన్న సైనివానిపేటలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు 80 మీటర్ల పొడవు గల సిసి రోడ్డును రూ. 2 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోపే ప్రతి పల్లెలో సిసి రోడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురిపింటి పాపారావు, తులసీరావు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ఆమదాలవలస: నియోజవర్గంలోని ఇరిగేషన్ రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న బూర్జ, పొందూరు, ఆమదాలవలస, నారాయణపురం ఆనకట్ట కాలువల అభివృద్ధి పనులకు రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ నుంచి రూ.19.01 లక్షల ఒక వేయి మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ఆమదాలవలస మండలం పరిధిలో మూడు, బూర్జ, పొందూరు మండల పరిధిలో ఒక్కో పని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిధులు విడుదల చేసిన సిఎం నారా చంద్రబాబు నాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పిపిపి విధానంలో కళింగపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, భీమునిపట్నం - నర్సీపట్నం 192 కిలోమీటర్ల ప్రధాన రహదారి సర్వే నిమిత్తం రూ.4 కోట్ల 80 లక్షలు, అలాగే చిలకపాలెం - రామభద్రపురం - రాయఘడ, విజయనగరం - పాలకొండ రెండు రాష్ట్రాల పరిధిలోని 203 కిలోమీటర్ల రహదారుల ఆధునీకరణ పనుల సర్వే నిమిత్తం రూ.5 కోట్ల 8 లక్షలు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.

కిడ్నీ ఆస్పత్రిలో పోస్టులు భర్తీ చేయాలి

పలాస: పలాస కిడ్నీ ఆస్పత్రిలో ఫార్మసీ అధికారి, డైటిషియన్ పోస్టులు భర్తీ చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీషకు రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాల్ విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగుల భర్తీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. శుక్రవారం వెంగళరావు కాలనీలో సైబర్ మోసాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అలాగే గంజాయికి అలవాటు పడ్డ వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి సమాచారాన్ని తెలియజేస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి డీ అడిక్షన్ సెంటర్ ద్వారా మామూలు మనుషులుగా మార్చుతామన్నారు. రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

అలాగే ఎటిఎం కేంద్రాల వద్ద గుర్తు తెలియని వ్యక్తులకు ఎటిఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయమని కోరవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు నిర్వహించే చిట్ ఫండ్‌లలో చిట్స్ కట్టి మోసాలకు గురికావద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

అపార్ నెంబర్ నమోదును పరిశీలిస్తున్న ఎంఇఒ లింగరాజు

ప్రజాశక్తి- పోలాకి

పాఠశాలలో విద్యార్థులకు అపార్ నెంబర్ క్రియేట్ చేసి నమోదు చేయాలని ఎంఇఒ-2 టి.లింగరాజు ఆదేశించారు. శుక్రువారం గొల్లలవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల వివరాలను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, అపార్ నెంబర్ ఎంతమందికి ఆన్‌లైన్‌లో నమోదు చేశారనే అంశాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఎస్ఎ పరీక్షల నిర్వహణ, ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ సెక్సువల్ అఫిన్సెస్ కంప్లైంట్ బాక్స్ నిర్వహణ, ఆ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అంశాలపై పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం రవణమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రణాళికలతోనే పంచాయతీకు నిధులు

ప్రజాశక్తి- పలాస

గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, అలా చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా గ్రామ పంచాయతీకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా పరిశీలకులు కె. నాగరాజు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒలు, పంచాయతీ విస్తరణాధికారులు, కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై రెండోరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయకపోతే కేంద్ర ప్రభుత్వం నిధులు ఆగిపోతాయన్నారు. పంచాయతీలో తయారు చేసిన ప్రణాళికలను పరిశీలించి కేంద్రం నిధులతో పాటు అవార్డులు ప్రకటిస్తుందని, ఆ దిశగా కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. తయారు చేసిన అభివృద్ధి ప్రణాళికలు, నిర్వహించిన గ్రామసభ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అంతక ముందు కె.గోపినాథ్, వై.జ్యోతి, శ్రీనివాస్, కిషోర్ కుమార్ శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంపిడిఒలు వసంత కుమార్, రమేష్ నాయుడు, తిరుపతి రావు, ప్రేమ కుమారి, రిసోర్స్ పర్సన్ పేరాడ ఆనందరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయులుగా మన బాధ్యతని ఎంఇఒ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 14వ వార్డు పరిధిలో చిన్న కృష్ణాపురం ఎంయుపి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఎఫ్ఎ-2 పరీక్షల నిర్వహిస్తున్న విధానాన్ని పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తున్న తీరును గమనించి తరగతి గదిలోని విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనం రుచిపై విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్‌ను కలిసిన డ్వామా పీడీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఇటీవల బదిలీల సమయంలో నియమితులైన డ్వామా ప్రాజక్టు డైరక్టర్ బి. సుధాకరరావు శుక్రవారం జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయను మర్యాద పూర్వకంగా కలసుకున్నారు. జెడ్‌పి ఆవరణలో ఉన్న ఆమె క్యాంపు కార్యాలయంలో కలసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం జిల్లాలో నీటి యాజమాన్య సంస్థ పరిధిలో చేపడుతున్న పనులపై ఆమెతో చర్చించారు.

రేపు దళిత మహాసభ కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి- రణస్థలం

ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రణస్థలం మండలశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 10 గంటలకు దళిత మహాసభ కార్యవర్గ ఎన్నికలు స్థానిక హైస్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు బారిక రాము ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గల కార్యకర్తలు, మహిళలు, యువజన సంఘ సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత మహాసభ అధ్యక్షులు బోకర నారాయణరావు పాల్గొంటారన్నారు.

నాక్ బృందం పర్యటన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7 తేదీల్లో నాక్ బృందం పర్యటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ స్వామి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలను ఐదేళ్లకు ఒకసారి మూల్యాంకనం చేసి ఒక గ్రేడ్‌ను ఇస్తుందని తెలిపారు. నాక్ అక్రిడిటేషన్ యొక్క ధ్రువీకరణ సంస్థల నాణ్యత విశ్వసనీయతకు గ్రేడ్ ఇస్తుందన్నారు. ముగ్గురు సభ్యులు కలిగిన బృందం పర్యటించారని వీరిలో మహారాష్ట్రలోని గోండ్వానా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలర్ డాక్టర్ శ్రీరామ్ కవాలే వైస్ చైర్మన్‌గా, తమిళనాడు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ రాజలింగం నారాయణన్ కోఆర్డినేటర్‌గా, గుజరాత్‌కు చెందిన డాక్టర్ రాకేష్ రావు నెంబర్‌గా కమిటీ నియమించబడిందని తెలిపారు.

అనుమానితుల సమాచారం తెలియజేయాలి

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాల్లో అనుమానితులు తారసపడితే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. శుక్రవారం పిరియగ్రహారంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే సమాచారం తెలియజేయాలన్నారు.

పెద్దపులి జాడపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశాలోని చీకిటి పరిసర ప్రాంతాల్లో పెద్దపులి పాద ముద్రలను ఆటవీ శాఖాధికారులు ఇటీవల గుర్తించారు. ఆంధ్రా పరిసర ప్రాంతాలకు 5 కిలోమీటర్లు దూరంలో చీకటి గ్రామం ఉంది. దీంతో కాశీబుగ్గ ఆటవీ శాఖాధికారి మురళీ కృష్ణంనాయుడు ఆదేశాల మేరకు ఆటవీశాఖ సిబ్బంది సరిహద్దు ప్రాంతాలైన కేదారిపురం, ముచ్చింద్ర తదితర గ్రామాల ప్రజలకు శుక్రవారం అప్రమత్తం చేశారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులు నమ్మవద్దన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ రాము, బీట్ అధికారులు డి.సరేష్, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు..

జిఇఒ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న నిర్వహిస్తున్న జిఇఒ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 పోస్టర్‌ను మహ్మద్ రఫీ, రజియా విడుదల చేశారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న వి వన్ రెస్టారెంట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్లోబల్ ఎంపర్మెంట్ ఆర్గనైజషన్ సేవలు విస్తతం కావాలని, సభ్యులు సద్గుణ ఆలోచన గొప్పదని, అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదన్నారు. తాము కూడా స్వచ్ఛందంగా ఒక సంస్థని నిర్వహిస్తున్నామని, అందుకు రఫీ సహకారం వర్ణించరానిదన్నారు. రఫీ మాట్లాడుతూ తమ పూర్తి సహాయ సహకారాలు జిఇఒకు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాయిబాబా , ఆదిత్య ఈవెంట్స్ అనిల్, వీ-వన్ రెస్టారెంట్ అధినేత శ్రీధర్, గోపి, స్వరూప్ పాల్గొన్నారు.

పశుగణనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పాతపట్నం

పశుగణన కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు జాగ్రత్తగా సమాచారం సేకరించాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర రావు అన్నారు. మంగళవారం పాతపట్నం, మెలియాపుట్టి మండలాల ఎన్యూమరేటర్లకు ఆయన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 30 నుంచి 40 ఇ ళ్ల వరకు సమాచారం సేకరించాలన్నారు. ఈ శిక్షణలో కొరసవాడ పశు వైద్యాధికారి డాక్టర్ పారసెల్లి అనిల్ శిక్షణలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెదలోగిడి పశువైద్యాధికారి డాక్టర్ కె.మౌనిక, రెండు మండలాల ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

పెన్షన్ అందించాలి

ప్రజాశక్తి- నందిగాం

జిల్లా గ్రంథాలయ సంస్థలో ఉద్యోగ విరమణ పొందిన ఫెన్షనర్లకు నేటివరకు అక్టోబర్ నెల ఫెన్షన్లు అందలేదని వెంటనే అందించాలని గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.వైకుంఠరావు ఒక ప్రకటనలో కోరారు. విశ్రాంత ఉద్యోగులు నిత్యవసరాలు, ఆరోగ్యరీత్యా మందులు వంటి అవసరాలు తీర్చుకోలేకపోతున్నారని, తక్షణమే ముఖ్యమంత్రి చొరవ చూపి పెన్షన్లు అందించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కోటబొమ్మాళి: జిల్లాలో పని చేస్తున్న 104 వాహన సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ అప్పలరాజుకు స్థానిక 104 సిబ్బంది ఆయన కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, 104 సేవలను ప్రభుత్వమే పిహెచ్‌సిల ద్వారా నిర్వహించాలని కోరారు. డిఎస్‌సి ద్వారా నియమితులైన సీనియర్ చోదకులను ఒప్పంద విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది కోట రమణమూర్తి తదితరులున్నారు.

ఎపిఎంగా ప్రసాదరావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


ప్రసాదరావు

మండల వెలుగు ఎపిఎంగా గొడబ ప్రసాదరావు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా మందస మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. గతంలో ఐదేళ్ల వజ్రపుకొత్తూరులో ఆయన సేవలందించారు. మహిళ సంఘలా అభివద్ధి, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సమావేశాలు నిర్వహించడంతో గతంలో మండలంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.